సాక్షి నిర్మల్

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రిని శనివారం తనిఖీ చేశారు. 8లో▸



ఈ సారైనా 'దూరం' తగ్గేనా..?

ఈ నెల 9 నుంచి కేయూ డిగ్రీ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు సంబంధించి కేంద్రాలు దూరంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 / 15.3

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న ఈశ్వర్

నిర్మల్‌టౌన్: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వరుణ్‌రెడ్డిని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఉన్నారు.

మెరిట్ జాబితా విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ కింద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ నియామకానికి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి మెరిట్, రిజెక్ట్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో, nirmal. telangana. gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఈ నెల 7న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు.

మొగి పురుగు నివారణపై అవగాహన


సాక్షి స్పందన

లక్ష్మణచాంద: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటకు మొగిపురుగు, అగ్గి తెగులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిపై 'మొగి మంచుతోంది' శీర్షికన 'సాక్షి'లో కథనం ఇచ్చాం. దీనికి స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ శనివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. సోన్, పాక్‌పట్ల గ్రామాలను సందర్శించి రైతులకు మొగి పురుగు లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. మొగి పురుగు నివారణకు క్లోరాన్ ట్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు, జింక్ లోపం నివారణకు జింక్ చిలటెడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులు అధిక మోతాదులో వాడటం, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందక పోవడం వలన వరి పసుపు వర్ణంలో మారుతున్నాయని తెలిపారు. దీని నియంత్రణకు అమ్మోనియం సల్ఫేట్, కాంప్లెక్స్ 20 -20-0-13 లాంటి కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని పేర్కొన్నారు. పొలాన్ని సన్న నెర్రెలు వచ్చే వరకు ఆరబెట్టి అప్పుడప్పుడు నీరు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్, టెక్నికల్ వ్యవసాయ అధికారి వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, అంబాజీ, రైతులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఐ పోస్టుల భర్తీకి 6, 7 తేదీల్లో ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: 108 సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలెట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 6, 7వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని 108 మేనేజర్ వై.మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంఆర్ఐ పోస్టుకు బీఎస్సీ లైఫ్ సైన్స్, ఎంఎల్టీ, డీఎంఎల్టీ, జీఎన్ఎం, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ పూర్తిచేసిన అభ్యర్థులు, పైలట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి లైట్ మోటార్ వెహికల్ బ్యాచ్ నంబర్ ఉన్నవారు అర్హులని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్‌తో జిల్లా కేంద్రంలోని 108 ఆఫీస్‌కు ఉదయం 10 నుంచి 3 గంటలలోపు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9603386316, 73300 63616 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సిరాల ప్రాజెక్టును సందర్శించిన విద్యార్థులు



సిరాల ప్రాజెక్టు వద్ద విద్యార్థులు

భైంసారూరల్: మండలంలోని సిరాల ప్రాజెక్టును సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు శనివారం సందర్శించారు. పట్టణంలోని సుభద్రనిలయం శిశు మందిరం విద్యార్థులను ఉపాధ్యాయులు సిరాల ప్రాజెక్టుకు తీసుకువెళ్లారు. సిరాల ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు రైతులు గంగాధర్, తాహెర్ ప్రాజెక్టు విశిష్టతను వివరించారు. తర్వాత సిరాల ఇనుపరాళ్ల గుట్టపై ప్రసిద్ధి చెందిన హరిహరాలయం సందర్శించారు. ఆలయ ప్రత్యేకతను విద్యార్థులకు తెలిపారు. అనంతరం గుట్ట పక్కనే నైజాం కాలంలో నిర్మించిన చెరువు అందాలను చూపించారు.



మిద్దెచింతలో దీపెంత వెలుగు బియ్యం ఏరుతున్న ఆదివాసీ గృహిణి



టార్చిలైట్ వెలుగులో చదువుకుంటున్న చాకిరేవు చిన్నారులు



చుట్టూ అడవిలో చాకిరేవు గ్రామం

ఆ ఊళ్లకు వెలుగెప్పుడో?

- కరెంటు చూడకుండానే తరాలు..
- ఇప్పటికీ అందని 'వెలుగు'రేఖలు
- ఏళ్లుగా మగ్గుతున్న ఆదివాసులు
- చాకిరేవు 'చీకట్ల'ను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- సోలార్ లైట్లకు 'ఆహా' చేయూత

చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో పల్లెలు.. కారుచీకట్లలో తరాలు గడిచిపోతున్నాయి. వనాన్నే నమ్ముకున్న ఆ ఆదివాసుల జీవితాల్లో ఇప్పటికీ 'వెలుగు' రావడం లేదు. బుడ్డి దీపాల కింద ఆ బిడ్డల చదువులు గుడ్డిగా సాగుతున్నాయి. చీకటి పడిందంటే చాలు ఎటునుంచి ఏమొస్తుందో.. తెలియని భయంలోనే ఆ గిరి పల్లెలు కాలం వెళ్లదీస్తున్నాయి. శాస్త్ర సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించామని గొప్పలు చెప్పకుంటున్నా... నిర్మల్ జిల్లాలో ఇప్పటికీ పలు అటవీ గ్రామాలకు కరెంటు అంటే తెలియదు. గిరి పల్లెల్లో ఎప్పుడో సర్కార్ ఏర్పాటు చేసిన సౌర వెలుగులు సైతం ఆరిపోయాయి. ఆ ఊళ్లకు కరెంటే కాదు.. కనీసం సరైన కాలిబాట కూడా లేదు. ఏ కష్టమొచ్చినా కిలోమీటర్ల కొద్దీ చెట్లు, పుట్టలు దాటుకుంటూ నడిచి రావాల్సిందే. ఇక ఇప్పటికీ సన్నగా పారే వాగుల ఒడ్డున తవ్వుకున్న చెలిమల నీళ్లే ఆ ఊళ్ల గొంతు తడుపుతున్నాయి. - నిర్మల్

జీవితాల్లోనూ చీకట్లే

చాకిరేవుతోపాటు జిల్లాలోని పలు అటవీ గ్రామాల్లో ఇదే దుస్థితి. ఆ ఊళ్లల్లోనే కాదు.. అక్కడి అడవి బిడ్డల జీవితాల్లోనూ చీకట్లే ఉన్నాయి. పెంబి మండలం పెద్దరాగిదుబ్బ, సోముగూడ, కడెం మండలం మిద్దెచింత, రాంపూర్ గ్రామాలకు ఇప్పటికీ కరెంటు లేదు. ఈ గ్రామాల్లో వెలిగే బల్బును చూడనివాళ్లు ఉన్నారు. పెంబి మండలం కొసగుట్ట, గుమ్మెన ఎంగ్లాపూర్, అంకెన, వస్‌పెల్లి, రాగిదుబ్బ, గోధుమల, కడెం మండలం మైసంపేట్, ఇస్లాంపూర్ గ్రామాలు ఇప్పటికీ త్రీఫేజ్ కరెంటుకు నోచుకోవడం లేదు. కేవలం ఇంట్లో ఒక్క బల్బుతోనే వెళ్లదీస్తున్నాయి. పంటలు సాగు చేసుకోవాలంటే వర్షాధారమే. లేదంటే ఆయిల్ ఇంజనే దిక్కు. గతంలో ఇచ్చిన సోలార్ వీధిదీపాలూ పనిచేయడం లేదు. వర్షాకాలంలో ప్రమాదకరంగా ఉప్పొంగే వాగులను దాటుతూ ప్రాణాలను కోల్పోయిన అడవిబిడ్డలూ ఉన్నారు.

చాకిరేవు గోసచూడు..

పెంబి మండలం చాకిరేవు ఓ అటవీ గ్రామం. చుట్టూ దట్టమైన అడవిలోని ఆ ఊరు చేరాలంటే ఆరు కిలోమీటర్లు నడిచివెళ్లాలి. దారే లేని ఆ ఊరికి కరెంటు వస్తుందనుకోవడం అత్యాశే అవుతుంది. పెంబి మండల కేంద్రం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ గిరిపల్లెలో 40 ఆదివాసీ కుటుంబాలు ఉన్నాయి. దట్టమైన అడవిలో పగటిపూటే భయపడతాం. అలాంటిది చీకటి పడితే 'చుక్కలే...' దిక్కు. రాత్రయితే దీపాలు, టార్చిలైట్లు పట్టుకుని తిరగాల్సిందే. ఏ కష్టమొచ్చినా తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. కరెంటు లేకపోవడంతో చాకిరేవువాసులు వర్షాధార పంటలు, అటవీ ఉత్పత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.

75 కిలోమీటర్లు నడిచి..

కరెంటు, రోడ్డుతోపాటు చాకిరేవులో తాగడానికి మంచినీళ్లు కూడా లేని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో చాకిరేవువాసులు ఇంకెన్నాళ్లీ కష్టాలంటూ.. గతేడాది మార్చి 15న ఊరంతా ఏకంగా 75 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తమ గోసను జిల్లా అధికారుల కళ్లకు కట్టారు. 'అడవిలో ఉండే జంతువులకు బోర్లేస్తరు, కరెంటిస్తరు.. మనుషులం మేం కనబడతలేమా..?' అంటూ ఆక్రందన వెళ్లగక్కారు. తమ బిడ్డలు గుక్కెడు మంచినీళ్ల కోసం తల్లడిల్లుతున్నారని, చిన్నారుల దాహార్తి తీర్చాలని వేడుకున్నారు. ఇవన్నీ ఇచ్చేదాకా ఇక్కడే కారం, అటుకులు తింటూ ఉంటామని ఐదురోజులు కలెక్టరేట్ ఎదుటే ఉన్నారు. చివరకు కలెక్టర్, జిల్లా అధికారులే ఆ ఊరికి వచ్చి సోలార్ ఆధారంగా వీధి దీపాలు, బోర్లు ఏర్పాటు చేసే దాకా కదలలేదు.



వారి జీవితాల్లో రంగులేవి!

దినాం.. దివిలెనే!

మేమంతకన్నా హీనమా?

కష్టాలను కళ్లకు కట్టిన 'సాక్షి'..

చీకట్లలో మగ్గుతున్న చాకిరేవుతోపాటు అటవీగ్రామాల గోసను గత నాలుగేళ్లుగా 'సాక్షి' వరుస కథనాలతో కళ్లకు కట్టింది. వీలున్నప్పుడల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకొస్తోంది. గతేడాది అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీ చాకిరేవు వెళ్లేందుకు దోహదం చేసింది. కరెంటుతోపాటు కనీస సౌకర్యాలకు నోచుకోని ఇలాంటి ఊర్లు, అక్కడి ఆదివాసీల కష్టాలు ఇప్పుడిప్పుడే బాహ్యప్రపంచం గుర్తిస్తోంది. చాకిరేవు గోసను 'సాక్షి' మెయిన్ పేజీలో పలుమార్లు పాలకుల కళ్లకు కట్టింది. అప్పటినుంచి ఆ ఊరి పేరు, వారి బాధలు 'వెలుగు'లోకి వస్తున్నాయి. మీడియా ద్వారా చాకిరేవు కష్టాలను 'ఆహా' ఓటీటీ యాజమాన్యం గుర్తించింది. తాము నిర్వహిస్తున్న 'అన్‌స్టాపబుల్' ప్రోగ్రాంలో గ్రామ కష్టాలను ప్రోమో ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమ వ్యాఖ్యాత, హీరో బాలకృష్ణ, ఈ వారం అతిథిగా హాజరైన పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా రూ.లక్ష ఆర్థికసాయం చాకిరేవు పెద్దలకు అందించారు. త్వరలోనే చాకిరేవులో ఇంటింటికీ గ్రీన్(సోలార్) ఎనర్జీ ద్వారా వెలుగులు అందిస్తామని చెప్పారు. రాగిదుబ్బ, మిద్దెచింత వంటి అటవీ గ్రామాలు ఆశతో ఎదురు చూస్తున్నాయి. తమ ఇళ్లల్లో.. తమ బిడ్డల జీవితాల్లోనూ వెలుగులు నింపాలని కోరుతున్నారు.

తరాలుగా తిప్పలు..



అడవిని నమ్ముకుని బతుకుతున్న మాకు ఏళ్లుగా కష్టాలు తప్పడంలేదు. కనీసం కరెంటు కూడా లేకపోవడంతో చదువుకుంటున్న మా పిల్లలు ఇబ్బంది పడుతున్నరు. పాలకులు ఇప్పటికైనా మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
- లింబారావు, గ్రామపటేల్, చాకిరేవు

అడివిలో నడుసుడే..



మేం చిన్నప్పటి నుంచి చూస్తున్నం. అప్పటి నుంచీ ఇవే చీకట్లు. మా పిల్లల జీవితాల్లోనైనా వెలుగులు రావాలని కోరుకుంటున్నం. మా ఊరికి రావాలంటే అడివిల నుంచి కనీసం మూడు కిలోమీటర్లు నడవాలి. వేరే మార్గం లేదు.
-ఆత్రం శ్రీరామ్, గ్రామపటేల్, మిద్దెచింత

సమస్యలన్నీ పరిష్కరించాలి..



చాకిరేవుతోపాటు చాలా అటవీ గ్రామాల్లో ఇప్పటికీ కరెంటు లేకపోవడం దారుణం. విద్యుత్‌తోపాటు రోడ్డుమార్గం కూడా లేదు. కాలినడకనే వెళ్లాల్సిన దుస్థితి. తాగునీటికీ గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం సమస్యలన్నీ పరిష్కరించాలి.
- తొడసం శంభు, ఆదివాసీ నాయకుడు

అమ్మ స్ఫూర్తితోనే.. ఐఏఎస్!



నిర్మల్: 'మా అమ్మ నాగమణి వ్యవసాయశాఖలో పనిచేస్తారు. అమ్మతో అప్పుడప్పుడు పొలాలకు వెళ్లేవాడిని. అక్కడ ప్రజలకు అధికారిగా అమ్మ అందించే సేవలు చూసేవాణ్ని. అలాగే కలెక్టరేట్‌కు వెళ్లినప్పుడు కలెక్టర్ ద్వారా అందే సేవలనూ అమ్మ చెప్పేది. అలా అమ్మ ఇచ్చిన స్ఫూర్తికి నాన్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి ప్రోత్సాహం తోడుకావడంతో నేనూ ఐఏఎస్ అయ్యాను. ఇది ఒక ప్రయత్నంలోనే దక్కలేదు. నాలుగుసార్లు ఓటమి ఎదురైనా ఓపికతో చేసిన పోరాటంలో ఐదోసారికి విజయం వరించింది' అని తెలిపారు కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి. 2019 బ్యాచ్ ఐఏఎస్ అయిన ఆయన సివిల్స్‌లో ఆలిండియా ఏడో ర్యాంక్‌తో సత్తాచాటారు. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ జిల్లాలోనే పొందారు. ఐఐటీ నుంచి ఐఏఎస్ దాకా ఆయన ఎదిగిన విధానం.. జిల్లాలో తన ముద్ర ఎలా ఉండబోతుందో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

- ఓపికతో శ్రమిస్తే విజయం తథ్యం
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుస్తాం
- సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి

సాక్షి : కలెక్టర్‌గా తొలిపోస్టింగ్ ఎలా ఉంది?

కలెక్టర్ : నిర్మల్ జిల్లాలో కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ రావడం చాలా సంతోషంగా ఉంది. ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా జిల్లాలోనూ పర్యటించాను. ఈ జిల్లాలో అన్నిరకాల వేరియేషన్స్ ఉన్నాయి. ఖానాపూర్ ప్రాంతం ఒకలా, ముధోల్ ఏరియా మరోలా ఉంటుంది. నిర్మల్ రెండింటి కలయికగా ఉంటుంది.

సాక్షి : మీ కుటుంబ నేపథ్యం గురించి..

కలెక్టర్ : మాది మిర్యాలగూడ. అమ్మ నాగమణి వ్యవసాయశాఖలో అధికారి, నాన్న జనార్దన్‌రెడ్డి వైద్యుడు. తమ్ముడు పృథ్వీ జనరల్ మెడిసిన్ చేస్తున్నాడు. నా వైఫ్ చాహత్ బాజ్‌పాయ్ కూడా ఐఏఎస్. నా బ్యాచ్‌మేట్. మాది లవ్ అండ్ అరేంజ్ మ్యారేజ్. తను ప్రస్తుతం కుమురంభీమ్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా ఉన్నారు. నిజానికి నేను ఇంజినీరింగ్ సైడ్. జేఈఈలోనూ 29వ ర్యాంక్ సాధించా. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదివాను.

సాక్షి : ఐఐటీ నుంచి ఐఏఎస్ ఎలా..

కలెక్టర్ : అమ్మానాన్నల ప్రోత్సాహంతో సివిల్స్‌కు ప్రిపేరయ్యాను. రెండుమూడుసార్లు మిస్ కావడంతో విదేశాలకు వెళ్లిపోదామనుకున్నా. కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇచ్చిన స్ఫూర్తితో ఒత్తిడికి లోనవ్వకుండా మళ్లీ ప్రిపేరయ్యాను. నాలుగోసారి ఐఆర్ఎస్ వచ్చింది. అప్పుడు ఇన్‌కంట్యాక్స్ అధికారిగా చేరాను. ఐదోసారి గట్టిగా ప్రయత్నించాను. అప్పుడు ఐఏఎస్ వచ్చింది. కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్‌గా, ఐటీడీఏ పీవోగా చేసి నిర్మల్ కలెక్టర్‌గా వచ్చాను.

సాక్షి : మీ పోరాటంలో గుర్తించినవి, నేటి అభ్యర్థులకు చెప్పాల్సినవి..

కలెక్టర్ : ప్రధానంగా పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవారు పక్కా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఎప్పుడూ ఒత్తిడికి లోనుకావొద్దు. కుటుంబంతోపాటు మంచి స్నేహితులతో పంచుకుంటూ మానసిక దృఢత్వాన్ని పెంచుకోవాలి. అప్పుడే ఏదైనా సాధించగలం అన్న నమ్మకం పెరుగుతుంది.

సాక్షి : మీ హాబీలు ఏమిటి

కలెక్టర్ : నాకంటూ పెద్దగా హాబీలు లేవు. జాగింగ్, లాన్‌టెన్నిస్, క్రికెట్, బాస్కెట్‌బాల్ ఆడటం ఇష్టం. కొత్త ప్రదేశాలకు ట్రావెలింగ్ చేయడం కూడా ఇష్టమే. బుక్ రీడింగ్ చేస్తాను. ఆఫ్గన్ పరిస్థితులపై అక్కడి రచయిత ఖలీద్ హోస్సైనీ రాసినవి నచ్చాయి.

సాక్షి : మీకు స్ఫూర్తి, ప్రేరణ ఇచ్చిన వ్యక్తులు..

కలెక్టర్ : ముందు అమ్మానాన్న, ఆ తర్వాత మా టీచర్స్, ఫ్రెండ్స్, మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ కూడా.

మీరు ఐఐటీయన్ కదా.. మీ పాలనలో దాని ప్రభావం..

పాలనాపరంగా అవసరమైన చోట సాంకేతికతను ఉపయోగిస్తాం. ఇంతకుముందు ఇక్కడ చేసిన కలెక్టర్ ముషరఫ్‌అలీగారు అమలు చేసిన లైవ్‌లొకేషన్ విధానం బాగుంది. ఆ కంట్రోల్ రూమ్ అలాగే కొనసాగిస్తాం. విద్యా,వైద్యంతో పాటు వీలైతే మరిన్ని శాఖలకు విస్తరిస్తాం.

సాక్షి : జిల్లాలో మీ ప్రథమ ప్రాధాన్యం ఏమిటి

కలెక్టర్ : నేను బాధ్యతలు తీసుకుని కేవలం నాలుగైదు రోజులే అవుతుంది. రెండుమూడు నెలల తర్వాత జిల్లాపై ఓ ఐడియా వస్తుంది. ప్రస్తుతానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటివెలుగు, మన ఊరు-మనబడి, డబుల్‌బెడ్రూం ఇళ్లు, సమీకృత కలెక్టరేట్, అమ్మఒడి, పట్టణాభివృద్ధి, పల్లెప్రగతి, ఉపాధి, ఆయిల్‌పాం సాగును పక్కాగా అమలు చేస్తాం. ఐటీడీఏలో పనిచేసిన అనుభవంతో ఇక్కడి గిరిజనుల అభివృద్ధికి కృషిచేస్తా.

సాక్షి : నిర్మల్‌పై మీ అభిప్రాయం..

కలెక్టర్ : జిల్లాగా ఏర్పడిన తర్వాత అభివృద్ధిలో దూసుకుపోతుంది. ఆ స్థాయిలోనే ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తాం. జిల్లాను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు పెంచుతాం. టూరిజం కార్పొరేషన్ సహకారంతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తా. పాలకులు, అధికారులు, ప్రజల సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా.

పల్లెల ప్రగతే అభివృద్ధికి సోపానం

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: పల్లెల ప్రగతే అభివృద్ధికి సోపానమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పల్లెలను ప్రగతిపథంలో నడిపించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్ల ప్రగతిపై చర్చించారు. ప్రతీ గ్రామం పచ్చదనం, పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఎంపీడీఓలు, ఎంపీవోలు, ఏపీవోలు తరచూ గ్రామాలను సందర్శించాలన్నారు. ఎంబీ రికార్డ్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ రెండు మండలాలను సందర్శిస్తానని తెలిపారు. పన్నుల వసూలులో దస్తూరాబాద్, కడెం, మామాడ మండలాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. త్వరగా లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సీఈవో సుధీర్, పంచాయతీ అధికారి శ్రీలత, ఎంపీడీవోలు, ఎంపీపీలు, డీఏవోలు పాల్గొన్నారు.

నచ్చన్‌ఎల్లాపూర్‌లో జాతీయ గణాంక సర్వే



జీపీ కార్యాలయం ఎదుట సర్వే బృందం

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో జాతీయ గణాంక సర్వే బృందం శనివారం పర్యటించింది. గ్రామంలో గృహ వినియోగదారుల వ్యయ సర్వే నిర్వహించినట్లు ఎన్ఎస్‌వో బృంద సభ్యులు రాకేశ్, ప్రవీణ్ తెలిపారు. బృందం వెంట సర్పంచ్ బొడ్డు గంగన్న, పంచాయతీ కార్యదర్శి మనోజ్, ఎఫ్ఏ కమలాకర్, కారోబార్ మహేందర్ ఉన్నారు.



బోనమెత్తిన కుంటాల

కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారం ముగిసింది. చివరి రోజు ఊరంతా బోనమెత్తింది. - 8లో▸

క్లుప్తంగా

అనుమానాస్పదంగా ఒకరి మృతి

ఇచ్చోడ: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని సిరిచెల్మ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్ వివరాల ప్రకారం... రేకుల నారాయణ(55) కొంతకాలం నుంచి చేపల వేట కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం ఉదయం 7గంటల ప్రాంతంలో సిరిచెల్మలోని ఎల్లమ్మగుడికి వెళ్లే రోడ్డులో అనుమానాస్పదంగా పడి ఉండగా గ్రామస్తులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని చూడగా మృతిచెంది ఉన్నాడు. తల్లి సల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

పెంబి: మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన సర్పంచ్ ఆత్రం రాధ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై రజనీకాంత్ శనివారం వివరణ కోరగా వేణునగర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వారి కుటుంబీకుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తానూరు: వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నర్సింగ్‌బాను తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం పొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన చవాన్ అంబాదాస్, సయ్యద్ రసుల్ అత్యాచారానికి యత్నించారు. బాధితురాలు కేకలు వేయడంతో పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శనివారం తెలిపారు.

వివాహిత అదృశ్యం

భైంసాటౌన్: పట్టణంలోని నయాబాదికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... భైంసాకు చెందిన ఫెరోజ్ అలీకి నవీపేట మండలం నాగేపూర్‌కు చెందిన సనా కౌసర్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. శుక్రవారం ఉదయం నాగేపూర్‌కు వెళ్లేందుకు భార్యతో కలిసి భైంసా బస్టాండ్‌కు చేరుకోగా తనకు తల నొప్పి ఉందంటూ భార్య చెప్పడంతో మందుల కోసం ఫెరోజ్ వెళ్లి వచ్చేసరికి కౌసర్ కనిపించలేదు. దీంతో ఫెరోజ్ అలీ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు


గోటితో వడ్లను ఒలుస్తున్న మహిళలు

దస్తురాబాద్:భద్రాచలంలో శ్రీరామనవమి రోజున నిర్వహించే స్వామివారి కల్యాణానికి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు పంపనున్నట్లు ఆలయ అర్చకుడు కొండమాచార్యులు తెలిపారు. శనివారం గోటి తలబ్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. 15వరకు తలంబ్రాలు ఒలువనున్నట్లు తెలిపారు. భాగ్యలక్ష్మి, లలిత, లక్ష్మి, సుగుణ, రాజవ్వ, శృతి ఉన్నారు.

ఈ సారైనా దూరం తగ్గేనా..?

- ఈ నెల 9 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు
- గతంలో దూరంగా పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 50శాతం మంది విద్యార్థులు గైర్హాజరు
- దూరం తగ్గించాలని విద్యార్థుల వేడుకోలు
- అనుకూల కేంద్రాల కోసం యాజమాన్యాల లాబీయింగ్

కేయూ పరిధిలో...
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం డిగ్రీ కళాశాలలు : 137
డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు : 18వేలు


కాకతీయ యూనివర్సిటీ

ఈసారైనా పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు కోరుతున్నారు. ఇటీవల డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఇంకా కొన్ని జరుగుతున్నాయి. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సర పరీక్షలు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను దూరంలో కాకుండా స్థానికంగా ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. దూరంగా ఏర్పాటు చేస్తే పరీక్షలకు గైర్హాజరయ్యే పరిస్థితి లేకపోలేదు. – బోథ్

దూరాభారంతో పరీక్షలకు గైర్హాజరు...

డిగ్రీ పరీక్ష కేంద్రాలను ఏకంగా 25 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేకపోతున్నారు. ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షలకు గ్రామీణ ప్రాంతాల్లోని 50శాతానికి పైగా విద్యార్థులు హాజరుకాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుండగా 8.30లకు పరీక్ష కేంద్రంలో ఉండాలి. 25 నుండి 40 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే ప్రైవేటు ఆటోల్లోనే రావాల్సి వస్తోంది. ఉదయం 6.30లకు ఇంటి నుంచి బయలుదేరితే 8.30లకు పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా అలసిపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పరీక్ష కేంద్రాలు.. దూర ప్రాంతాలు

- బోథ్ మండలంలోని ఓ ప్రైవేటు కళాశాల సెంటర్ ఇటీవల ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేశారు. బోథ్ నుంచి పరీక్ష కేంద్రం 25 కిలో మీటర్ల దూరంలో ఉంది. మండలంలోని నిగిని, కంటెగాం, రఘునాథ్‌పూర్, నారాయణపూర్, వజ్జర్, చింతల్ బోరితో పలు గ్రామాలకు చెందిన చాలా మంది విద్యార్థులు దూరాభారంతో పరీక్షలకు హాజరుకాలేదు. ఈ గ్రామాల నుండి ఇచ్చోడలోని పరీక్ష కేంద్రం దాదాపు 40 కిలోమీటర్ల దూరం. బోథ్ మండలంలోని దాదాపు 30 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- బజార్‌హత్నూర్ మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాల సెంటర్‌ను ఇటీవల కేవలం 7కిలో మీటర్ల దూరంలోని ఇచ్చోడ మండల కేంద్రంలో ఏర్పాటు చేయకుండా 23 కిలో మీటర్ల దూరంలోని నేరడిగొండలోని ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేశారు. మండలంలోని అనేక గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోలు కూడా సరిగా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి.
- నేరగిడొండ మండలంలోని ప్రైవేట్ కళాశాలల కేంద్రాలను ఇటీవల జరిగిన పరీక్షల్లో ఇచ్చోడలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ మండలంలోని మారుమూల ప్రాంతాలైన కుంటాల, గుత్పాల, వాంకిడిచ కొరిటికల్, తాండ్రతో పాటు పలు గ్రామాల్లోని విద్యార్థులకు దాదాపు 30 నుంచి 40కిలో మీటర్ల దూరం.
- ఇచ్చోడలోని ఓ కేంద్రం బస్టాండ్ నుండి 2 కిలో మీటర్ల దూరంలో ఉండడంతో ఓ విద్యార్థిని అంతదూరం నడవలేక తిరిగి ఇంటికి వచ్చేసింది. విద్యార్థినిలు దూరంగా ఉన్న కేంద్రాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ఆదివాసీలపై చిన్న చూపు తగదు



డిగ్రీ పరీక్షల కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేయడంతో ఆదివాసీ విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేకపోతున్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆదివాసీ విద్యార్థులపై చిన్నచూపుతో మాట్లాడటం తగదు. బస్సులు కూడా గ్రామాలకు రావు. ఆటోల్లో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండడంతో పాటు ఖర్చుతో కూడుకున్నది. మండల కేంద్రాల్లోనే ఏర్పాటు చేయాలి.

– భోజన్న, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు

భారంగా ప్రయాణం...

పరీక్ష కేంద్రం దూరంగా ఉండడంతో విద్యార్థులకు ప్రయాణం భారంగా మారింది. ఇంటి నుండి పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే ప్రతి రోజూ ఒక్కొక్కరికి రూ. 200 నుంచి రూ.300 ఖర్చు అవుతోంది. దూరం ఎక్కువ కావడంతో విద్యార్థినిలతో పాటు వారి కుటుంబీకులు కూడా వారితో వెళ్లాల్సిన పరిస్థితి. ఆయా మండలాల కేంద్రాల్లోనే ఇతర కళాశాలల్లో లేదా పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు దూరాభారం తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

అనుకూల కేంద్రాల కోసం...

ఎప్పటిలాగానే డిగ్రీ పరీక్షల కేంద్రాలను అనుకూల కళాశాలలో ఏర్పాటు చేసుకోవడానికి యాజమాన్యాలు లాబీయింగ్ మొదలు పెట్టాయి. ఎమ్మెల్యేలతో యూనివర్సిటీ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ అధ్యాపకుడితో పలు యాజమాన్యాలు లాబీయింగ్ నిర్వహిస్తున్నాయని, విందుతో పాటు డబ్బులు ముట్టజెప్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని నిజం చేస్తూ ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఏకంగా 300 పైగా విద్యార్థులు డిబార్ అయ్యారు. అలాగే ఇచ్చోడలోని ఓ కేంద్రంలో విద్యార్థులు స్క్వాడ్‌బృందం కారుపై దాడి చేయడం కలకలం రేపింది.

నిర్లక్ష్యపు సమాధానం..

కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారికి 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. తమకు ఏ సెంటర్ ఎక్కడ వేయాలో తెలుసునని, ఆదిలాబాద్ ప్రాంతం తనకు తెలుసని, విద్యార్థులకు దూరమైనా పరీక్షలు రాయాల్సిందేనని పేర్కొన్నారు. వారే వచ్చి పరీక్ష రాస్తారని వివరణ ఇచ్చారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'తహసీల్దార్‌తో ప్రాణభయం'

- పోలీస్‌స్టేషన్‌లో ఎంపీటీసీ సభ్యురాలు ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్ ఎదుట ఎంపీటీసీ, గ్రామస్తులు

కడెం: కడెం తహసీల్దార్ గజనస్‌తో తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కట్ల సింధూజ ఆరోపించింది. ఈ మేరకు శనివారం పలువురు గ్రామస్తులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంబారిపేట్ గ్రామ సర్పంచ్ భర్త లచ్చన్న భూకబ్జా విషయమై ఇటీవల తహసీల్దార్‌కు తన భర్త సాగర్ ఫిర్యాదు చేశాడని, అప్పటి నుంచి తన భర్తను వివిధ కేసుల్లో ఇరికించారని వాపోయింది. తహసీల్దార్ బారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట ట్రైబల్ టీచర్స్ యూనియన్ ధర్నా


ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టిన జేఏసీ నాయకులు

ఉట్నూర్: రాష్ట్రంలో ఆర్టికల్ 244(1) అనుసరించి యాజమన్యాల వారిగా ఉపాధ్యాయులకు మైదాన, ఏజెన్సీ ప్రాంతాలుగా బదిలీలు, ఏజెన్సీ ప్రాంతంలో పదోన్నతులు షెడ్యూల్ ట్రైబల్స్‌కి మాత్రమే కల్పించాలని శనివారం ట్రైబల్ టీచర్స్ యూనియన్ జేఏసీ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో ట్రైబల్స్‌కు మాత్రమే ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగ బదిలీలు ఏజెన్సీ మైదాన ప్రాంతాలుగా నిర్వహించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ప్రకటించాలని, మైదాన ప్రాంతాల్లో ఎస్సీ ఉపాధ్యాయులకు నూతన జిల్లాలో నూతన మెరిట్ కం రోస్టర్ విధానంలో పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మెస్రం గంగారాం, జేఏసీ నాయకులు కపిల్‌కుమార్, తిరుపతి, చంద్రకాంత్, గణేశ్, దేవేందర్, రామారావు, శ్యామ్‌రావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం


వేటకు వెళ్ల వస్తున్న లక్ష్మీనరసింహస్వామి

కడెం: అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు దేవతామూర్తులతో సమీపంలోని అడవిలోకి వేటకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వంశీకృష్ణామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర రాజా రమేష్‌గౌడ్, భక్తులు ఉన్నారు.

దర్యాప్తు సరిగా ఉంటేనే శిక్షలు


అవగాహన కల్పిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

నిర్మల్‌టౌన్: దర్యాప్తు సరిగా ఉంటేనే నేరస్తులకు శిక్షలు పడతాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో జిల్లా పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో సైంటిఫిక్, టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. అలాంటప్పుడే నేరస్తులు తప్పించుకోలేరని తెలిపారు. ఈనెల 11న జరగబోయే నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీఐలు వినోద్, అజయ్‌బాబు, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

- పర్ధాన్ సమాజ్ పూజారి రమేశ్


కచ్చార్‌ఘడ్‌కు వెళ్తున్న పర్ధాన్ సమాజ్ కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: యువత ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ పూజారి రమేష్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కచ్చార్‌ఘడ్ జాతరకు జిల్లా కేంద్రం నుంచి శనివారం పర్ధాన్ కులస్తులు బయలుదేరారు. అంతకుముందు ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఆదివాసీ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పౌర్ణమిని పురస్కరించుకుని కచ్చార్ ఘాడ్‌లో జాతర కొనసాగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 5న నిర్వహించే పూజలకు తరలి వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు ఉన్నారు.

గురుకులంలో విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న నాయకులు

సారంగపూర్: జామ్ సాంఘికసంక్షేమ బాలికల గురుకులంలో 5వ తరగతి విద్యార్థిని మహిత మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ రమాకళ్యాణితో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో 620 మంది విద్యార్థులు ఉండగా, వారికి అనుగుణంగా స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవన్నారు. దీంతో విద్యార్థులు రాత్రి 1 గంట వరకు క్యూలైన్‌లో నిలబడి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని తెలిపారు. గీజర్లు లేకపోవంతో చలికాలంలో కూడా విద్యార్థులు చన్నీటి స్నానమే చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ఏఎన్ఎంతో చికిత్స చేయించకుండా ఎంబీబీఎస్ స్థాయి వైద్యాధికారితో చికిత్స చేయించాలన్నారు. వసతి గృహం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామ లక్ష్మణ్, పీడబ్ల్యూవో జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఏపీకేఎంఏ జిల్లా నాయకుడు మహమూద్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి


ప్రసూతి ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్


రోగికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- మీరు పని చేయండి.. మీ వెంట నేనుంటా
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- జిల్లా ఆసుపత్రి, ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా ఆసుపత్రితోపాటు ప్రసూతి ఆసుపత్రిని శనివారం తనిఖీ చేశారు. ప్రతీ వార్డును సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ, ఓపీ, డయాలసిస్, ఐసీయూ, ఆలన, ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్, ఆర్టీపీసీఆర్ కేంద్రం, టీహబ్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో మిషనరీ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

రెఫర్ చేయొద్దు..

జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల వార్డులు, నవజాత శిశు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. నవజాత శిశు కేంద్రంలో 900 గ్రాముల బరువుతో జన్మించిన చిన్నారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు ఇక్కడే వైద్యం చేయాలని రెఫర్ చేయకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మీ వెంటే నేనుంటా...

జిల్లా ఆసుపత్రి సందర్శించిన సందర్భంగా కలెక్టర్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. మీరు పని చేయండి.. మీ వెంట నేనుంటా అని వారికి భరోసా ఇచ్చారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఇటీవల రాష్ట్రంలోనే మొదటి స్థానంతో కాయకల్ప అవార్డు సొంత చేసుకున్నట్లు ముున్ముందు అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సామాన్య ప్రజలకు అందించేలా చూడాలన్నారు. ప్రస్తుతం వైద్యులందరూ కోఆర్డినేషన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఇకమీదట కొనసాగించాలని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ఆర్ఎంవో వేణుగోపాలకృష్ణ, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

బాసరలో బ్రహ్మీ వార్షికోత్సవాలు


గోదావరి నది వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

భైంసా: బాసరలోని నైమిశారణ్యం భవనంలో ఏటా నిర్వహించే బ్రహ్మీ తీర్థ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుజీ ఆర్కేరావు మాట్లాడుతూ.. మాఘమాసంలో చిన్నారులు బ్రహ్మీతీర్థం తీసుకోవడంతో విద్యాబుద్ధులతో పాటు ఉన్నత కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. కుటుంబంలో సుఖశాంతులు కలుగుతాయన్నారు. అంతకుముందు నైమిశారణ్య భవనంలో ఉపనాయనం, మహా చండీయాగం చేపట్టారు. కార్యక్రమంలో మహారాష్ట్ర తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.

మహారాష్ట్రలో ఖానాపూర్ ఎమ్మెల్యే ప్రచారం


మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగసభకు ప్రజలు హాజరుకావాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కోరారు. ఈమేరకు నాందేడ్ తాలూకాలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. మొదటిసారిగా మహారాష్ట్రలో జరిగే బీఆర్ఎస్ సభకు జన సమీకరణలో నిమగ్నమయ్యారు. ఆమె వెంట ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

బోనమెత్తిన కుంటాల


గజ్జలమ్మదేవికి పుష్పాలంకరణ


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


హారతిలో పాల్గొన్న దంపతులు


శివసత్తుల నృత్యాలు

కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఆడపడుచులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. శ్రీగురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిత్యవిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి లక్ష పూలతో అలంకరణ చేశారు. అల్లడి కవిత– వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి మహిళలతో కలిసి బోనమెత్తారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆప్కగజ్జారాం యాదవ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సర్పంచ్ సమత, సింగిల్ విండ్ చైర్మన్ సట్ల గజ్జారాం, బీజేపి జిల్లా నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ ఉన్నారు. – కుంటాల